లవ్స్ లేబర్స్ లాస్ట్!

రాయప్రోలు శ్యామ



పార్వతిని తొలి చూపులోనే ఆకర్షించేడు శేఖర్.

తొలిసారిగా అతనితో మాట్లాడినప్పుడు ఆ ఆకర్షణ రెట్టింపయింది. అది కాస్తా వికర్షించేదాకా వాళ్లిద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. ఒకరి "ఐడియాస్ అండ్ ఐడియాలజీస్" మరొకరితో ఎంతవరకూ సరిపోతాయో పోల్చి చూసుకున్నారు.

ప్రతినాణానికీ ఒక పక్క బొమ్మ మరొకప్రక్క బొరుసు ఉండటం న్యాయం. ఒకే నాణాన్ని ఇద్దరు వ్యక్తులు రెండు వేర్వేరు కోణాలనుంచి ఎగరేస్తే ఇద్దరికీ బొమ్మే పడాలనేముంది!

అవకాశం అనే "అణాకాసు"కి "అభిమానం" అనే పైపూత పూసి పార్వతి శేఖర్‌వైపుకి విసిరింది. శేఖర్ పార్వతిమీదకి గిరాటేసేడు.

నిరుద్యోగి శేఖర్‌కి బొమ్మపడింది. డబ్బుగల ఆసామీ ఏకైక పుత్రికతో పెళ్లికుదిరి ఫుల్‌టైమ్ జాబ్ దొరికింది.

పార్వతికి బొరుసు. నిరుత్సాహం, నిట్టూర్పులు మిగులు.

"లవ్స్ లేబర్స్ లాస్ట్... లవ్స్ లేబర్స్ లాస్ట్ ... లవ్స్ లేబర్స్ లాస్ట్" తలుపులు బిగించుకుని వంటరిగా తన గదిలో మంచంమీద పడుకుని అశాంతిగా అటూ ఇటూ దొర్లుతూ వంద సార్లనుకుంది పార్వతి ఆ మాట.

అనుకున్నప్పుడల్లా గుండె కలుక్కుమన్నట్లయింది. అనుకోడం మానేద్దామన్నా వీలుపడటం లేదు. ఏదో బాధ ... ఏమిటో వేదన. గట్టిగా ఎలుగెత్తి ఏడుద్దామని మధ్య మధ్య కోరిక ...

అదేం ఖర్మమో — గుండె కుతకుతలాడుతోందే కాని కన్నీళ్లే రావడంలేదు. "ఇంకెక్కడున్నాయి కన్నీళ్ళు ... ఎప్పుడో ఇంకిపోయేయి. "అమ్మ తనని వంటరిదాన్నిచేసి చచ్చిపోయినప్పుడే సగం ఇంకిపోయేయి. మిగిలిన సగం నాన్న ఇహలోక యాత్ర ముగించుకుని పోతూ పోతూ పట్టుకుపోయేడు" అనుకుంది బాధగా.

ఇంక ఏడుద్దామన్నా కరువే. అయినా ఏడ్చే అవసరం కూడా రాలేదింతవరకూను.

"ఇప్పుడు కలిగింది ..."

"కలగలేదు. అసలయినా ఎందుకేడవాలి ..."

"భలే! తెలీనట్లడుగుతున్నావే ... చేతికందిన పండు జారిపోయింది కనక ... ఎక్కబోయిన గోడ మీది కాలు పట్టుతప్పి కిందపడిపోయేవు కనక ... హిహిహి ..."

"నోర్ముయ్! నేనే గోడా ఎక్కబోలేదు. అది రాతి కట్టడం కాదని వట్టి డొలకనీ ముందే తెలుసు ...కాబట్టే ముందే ఎక్కేపని మానేసేను..."

"ఛస్. అబద్ధాలాడక! నక్క ద్రాక్షపళ్ల కథ గుర్తుకి తెస్తున్నావ్..."

కొంచెంసేపలా ఆత్మసైతాన్లమధ్య యుద్ధం జరగనిచ్చి నెమ్మదిగా మంచం మీది నించి లేచింది పార్వతి. లైటు వేసి బీరువా కున్న నిలువుటద్దంలో మొహం చూసుకుంది.

జుట్టు రేగిపోయి ... బొట్టు చెరిగిపోయి ... కళ్లు ఉబ్బిపోయి నానా చిరాకుగాను ఉంది మొహం. అర్ధరాత్రి మంచి నిద్రలో నించి లేచినా కడిగిన ముత్యంలా ఉండే తనీరోజెందుకిలా వెగటు పుట్టించేలా తయారయిందో అర్థం కాలేదా అమ్మాయికి.

"ఎందుకేమిటి! మంచం మీద బోర్లాపడుక్కుని ఎక్కెక్కిపడి ఏడ్చేవు ..." మళ్లీ అందుకుంది పార్వతిలో పార్వతి.

అసలు పార్వతి అద్దంలో పార్వతి కేసి కోపంగా

చూసింది. గుండెలో మళ్లీ గుబ గుబలాడి నట్లయింది.

"ఏడుస్తే ఏడుస్తాను, నీకేం. దెబ్బ తిన్నాను. అది మానేదాకా అరుస్తాను. నేనేం అతని ప్రేమకి దూరం అయిపోయి నందుకు పిచ్చెత్తి కొట్టుకోవడంలేదు."

అఫ్‌కోర్స్, ఎవరికయినా చేసిన పని తాలూకు ఫలితం చేజారిపోతే ఉడుకుబోత్తనం రాదూ! ఆ ఉడుకు చల్లారేక మళ్లీ మామూలే ...

జుట్టు సవరించుకుని, బొట్టు సరిదిద్దుకుని, చీర కుచ్చెళ్లు దులిపి మళ్లీ మంచం మీద వాలి పోయింది పార్వతి. నిద్రపోవాలి, తెల్లారితే మళ్లీ పెళ్లి పనులు ... హడావుడి.

అత్తయ్యకి సాయపడాలి. అవసరానికి కాకపోతే మంది ఉండి ప్రయోజనం ఏమిటి? ఆవిడ మొహం చూసి తన బాధ మింగేయాలి. చిరునవ్వులు చిందిస్తూ ... హుషారుగా తిరుగుతూ ఖంగు తిన్నట్లసలెవరికీ తెలియనియ్యకుండా గడిపేయాలి.

అసలు మనం 'ఖంగు' తినలేదు, అతన్ని ప్రేమించనూలేదు, అతని వెంటపడి పార్కుల్లోనూ, కాలవగట్ల మీద పరుగులు పెట్టలేదు.

మొదటి సారిగా అతను తనని పలకరించే దాకా ప్రతిరోజూ అతన్ని బస్సు స్టేజీలో చూస్తూనే ఉన్నా ... మొహం కేసి తేరిపారి చూడనేలేదు తను ... కాస్సేపు గతంలోకి పరుగెత్తింది పార్వతి మనసు.

ఆ రోజు తనెటో శూన్యంలోకి చూస్తూ నిలబడి ఉండగా – "పార్వతి ... కదూ" అని పలకరించేడతను. తన పేరు అపరిచితుడయిన అందగాడి నోటి వెంట వింటుంటే తనకేలాగో అయిపోయింది. కళ్లింతచేసి శేఖర్ కేసి చూసింది తను. అతడు చిరునవ్వులు చిందిస్తూ తను క్రిందటిరోజు బస్ స్టేజీలో మర్చిపోయిన పుస్తకం అందించేడు.

తను అతని మోహనరూపం చూస్తూ ఏం చెయ్యాలో తెలియక యాంత్రికంగా పుస్తకం అందు కుంది చాలా సేపటికి కాని అతనికి 'థాంక్స్' చెప్పాలని కూడా తోచలేదు తనకి. తీరా తోచాక తను ... సిగ్గుపడుతూ ... మెలికలు తిరిగిపోతూ "థాంక్స్" అనంగానే ... అతగాడు "డోంట్ బీ ఫార్మల్" అన్నాడు.

మత్తెక్కించే ఆ కంఠం, అతని మాటలు తన చెవుల్లో ఈ నాటికీ గింగురు మంటూ నే ఉన్నాయి.

"మిమ్మల్ని రోజూ చూస్తూనే ఉంటాను. కాని మీ వివరాలు ... మీ పుస్తకం ధర్మమా అని విన్ననే తెలిసేయి." నవ్వేడతను. తనూ నవ్వింది. ఆ క్షణంలో ఎన్నెన్నో ఆశలు ... ఎన్నెనో ప్రశ్నలు ...తన గుండెని దడదడ లాడించడం ఇప్పుడు కూడా గుర్తొస్తోంది.

అయితే అతను కూడా తన లాగే ... వివరాల సేకరణలో ఉన్నాడా! ... ఎందుకు? తనంత అందంగా ఉందా! పవిట సవరించుకుంటూ ... నవ్వుకుంటూ ... ఎటోచూస్తూ నిలబడింది.

ఇంతలో కాజీపేట – కాకతీయ యూనివర్సిటీ బస్సొచ్చింది. తనా బస్సులోనే ఎక్కి నయీమ్ నగర్ వొకేషనల్ ఇన్‌స్టిట్యూట్ దగ్గర దిగాలి. తనా ఇనిస్టిట్యూట్‌లో చేరిన దగ్గర్నుంచీ దాదాపు ప్రతిరోజు అతన్ని బస్సుస్టాండులో చూస్తూనే ఉంది. అతను తనని చూస్తున్నట్లు కూడా గమనించకపోలేదు. పలకరింపులు మాత్రం ఇదే మొదలు.

ఆ రోజంతా తను ఇంటా బయటా పరధ్యా నంగానే గడిపింది.

'పలకరింపులు వలపు తొలకరింపులకి దారి తీస్తాయని అనుకోలేద'ని పార్వతి తనని తాను మోసం చేసుకుంది కొంతకాలం.

"అబ్బే! వలపా ... పాడా ... ఊరికే స్నేహం జస్ట్ ఫ్రెండ్‌షిప్" అని మనసుని సద్దుమణిగిం చేసింది.

ఆశలు పెంచుకోవద్దు అనుకుంటూనే ఆశ పడింది. ఈ రోజిలా "కిక్కు" తిని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"ఛ. అసలతన్ని ఎక్కడికక్కడ 'కట్' చేసి ఉంటే బావుణ్ను. అతగాడితో తనకి పరిచయమే కాకుండా ఉంటే ఇంకా బావుణ్ను. తనీ వూరు రాకుండా ఉంటే మరీ బావుణ్ను."

దిండుకేసి తలబాదుకుంది పార్వతి.

కాని పార్వతికి ఈ వూరు రావడం తప్ప మరో మార్గంలేదు. అమ్మ తనని ఇంటికి ఆడదిక్కు చేసి చచ్చిపోయేక అయిదేళ్లపాటు నాన్నకి వండిపెట్టింది. ఆలనా పాలనా చూసింది. ఊళ్లోఉన్న హైస్కూలు చదువు ముగించి, ఇన్ని కష్టాలతోనూ ఓపిక చేసుకుని ఇంటర్ కట్టి పాసయ్యింది.

తనెంత బావటగా నిల్చినా తండ్రి, ఎలిమెంటరీ స్కూలు టీచర్ చేస్తూనే, అదమాయించే అమ్మ లేకపోవడంతో, సిగరెట్లు, బ్రాకెట్టు, మరెన్నో చిల్లర అలవాట్లు టోకున చేసుకున్నాడు. ఫలితం ఆర్థిక ఇబ్బంది, అల్సరువ్యాధి, అకాల మరణమూను. తను ఆ పల్లెటూళ్లో నా అనేవాళ్లు లేక కుళ్లికుళ్లి నశించిపోకుండా, నాన్న – కర్మకాండ జరిపించడాని కొచ్చిన మామయ్య కాపాడేడు కాబట్టి సరిపోయింది. బరువుగా ఊపిరి పీల్చింది పార్వతి.

పార్వతి మేనత్త లక్ష్మమ్మ, మామయ్య క్రిష్ణరావు కర్మ జరుగుతున్న రోజుల్లోనే పార్వతి భవిష్యత్తు చక్కగా ప్లాన్ చేసేరు.

"నా దగ్గరెలాగూ దీనికి ఈడయిన కొడుకు ల్లేరు. మా బావగారి అబ్బాయికి చేసుకోవచ్చు. మనం అడిగితే కాదనరు. ఆ కుర్రాడిప్పుడు 'పాలిటెక్నిక్' చదువుతున్నాడు. చదువు పూర్తయి ఉద్యోగంలో చేరితేనే కాని పెళ్లి చేసుకోడు. చేసుకున్నా కష్టంకదా! అప్పటిదాకా దీన్నెక్కడ ఉంచాలా అని ... మా యింట్లో గొడవ లోకానికి తెలిందేముంది! కడుపు చింపుకుంటే కాళ్లమీద పడుతుంది ... తమ్ముడి పిల్లే అయినా ... రావే... నీకేం భయంలేదు ... నా యింట్లో ఉండు ... అనేపాటి 'ఇది' లేదు నాకు."

పార్వతి కన్నీళ్లు తుడుస్తూ తన కన్నీళ్లొత్తు కుంది లక్ష్మమ్మ!

"మీరు మీ బావగారబ్బాయి సంబంధం చెదిరి పోకుండా చూడండి వదినా! దీన్నిప్పుడు నా వెంట తీసుకుని వెడతాను. ఆ కుర్రాడి చదువు పూర్తయి ఉద్యోగం వచ్చి ఆ కాస్త శుభం జరిగేదాకా పార్వతి మా యింట్లోనే ఉంటుంది. ఆ విషయంలో మీరు బెంగ పడనక్కర్లేదు. ఎటొచ్చీ ఈ సామాన్లన్నీ అంతదూరం తీసుకెళ్లడం కష్టం.







తీసుకెళ్ళినా అక్కడ ఇళ్ళు ఇరుకు కదా! ...'' నసిగేడు క్రిష్ణారావు,

తనింట్లో ఉన్న సోఫా కమ్ బెడ్స్, డ్రెస్సింగ్ టేబిల్', డైనింగ్ టేబిల్ మధ్య ఈ వెలసిపోయిన ట్రంకుపెట్టెలూ, నవారు తెగిపోయిన మంచాలు ఎక్కడ పెట్టాలని బెంగపడుతూ.

''సామానంతా ఎంత! ఒక నవారు మంచం, రెండు మడత మంచాలు, ఒక చెక్క కుర్చీ, రాగి డేగిసా, ఇత్తడిబిందె, రెండు పీట్లు కంచాలు, నాలుగు గ్లాసులు, ఒక చెంబు.

లక్ష్మమ్మ జాగ్రత్తగా గోనెబస్తాల్లో కట్టించి బండికేయించింది. ''రేపు పిల్ల మా బావగారింట్లో కాపురం చెయ్యడానికి వస్తుంది కదా, అట్నుంచి ఆటే దాని సామాన్లు దానికి అప్పగించేస్తాను. అందాకా మిద్దె మీద పడేసి ఉంచుతా. అవి నన్నేమయినా అన్నం అడుగుతాయా! ... వీళ్ళు కావాలంటాయా!!!

మామయ్య ఇచ్చిన అయిదు వందలతోటి, నాన్న చేసిన చిల్లర బాకీలు తీర్చి పెట్టె సద్దుకుంది పార్వతి.

లోకంలో మేనమామల భార్యల గయ్యాళి తనాలు కథలు కథలుగా విని ఉందేమో... పార్వతి శకుంతలమ్మ తనని 'ఛీ' కొడుతుందని భయపడింది. కాని కథ మరో మలుపు తిరిగింది.

శకుంతలమ్మ పార్వతిని కన్నబిడ్డలా కడుపులో పెట్టుకుంది. ''ఇంత చిన్నవయసులో నీ కెంత కష్టమొచ్చిందే తల్లీ ...'' అని కౌగలించుకుని బావురుమంది. ''పోనీలేమ్మా! నీకీ యింట్లో లోటుండదు. కడుపునిండా తిని కంటినిండా నిద్రపో'' అని ఊరడించింది. ''అదేమిటే ... ఆ వెలిసిపోయిన లంగాలు, వోణీలూనూ. పెళ్ళికెదుగుతున్న పిల్లవు. శుభ్రమయిన బట్టలేకపోతే ఎలా... మీ మామయ్యకి చెప్పి కొనిపిస్తాలే. అందాకా ఇవిగో ఈ చీరలు కట్టుకో.''

నిలువెత్తు బీరువాతెరిచి వరసలు వరసలుగా పేర్చిన మూడువందల అరవై అయిదు చీరలుతీసి కిందపడేసి, వాటిలోవి — తనకి విసుగు పుట్టించినవీ, తను 'ఓల్డు మోడల్' అనుకున్నవీ పది చీరలు ఎంచి పార్వతికి అందించింది.

లవ్స్ లేబర్స్ లాస్ట్

''నేను నాజూగ్గా ఉంటానుగా మరి! నా జాకెట్లు నీకు బిగువయిపోతాయి. కొత్తగా కుట్టిస్తాన్లే'' వేళాకోళంగా నవ్వుతూ తన రుబ్బురాయి జబ్బలు తడిమి చూసుకుంది శకుంతలమ్మ. పాతఫాషను చీరలే బనారస్ జరీ చీరల్లా కన్పించేయి పార్వతి కంటికి. రాత్రయ్యేక తన గదిలో వంటరిగా ఉన్నప్పుడు పది చీరలూ ఒకదాని తర్వాత ఒకటికట్టి అద్దంలో చూసుకుని మురిసిపోయింది. శకుంతలమ్మ చూపిస్తున్న ఆదరణలో ఆర్నెల్లపాటు తనని తాను మర్చిపోయిన పార్వతికి నెమ్మదిగా అర్థం అయింది, మామయ్య బిజినెస్ టాక్టిక్సు!

శకుంతలమ్మ వట్టిరోగిష్టిమనిషి. హై బి.పి., చక్కెర బీమారీ, కీళ్లవాతం, ఒకటేమిటి సృష్టిలో ఉన్న అన్ని వ్యాధులకీ పాపం ఆవిడ 'ఐక్యరాజ్యసమితి' లాంటిది. క్రిష్ణారావుకి సంసార సుఖాలు అందించలేకపోయింది. కనీసం సోలెడు బియ్యం అత్తెసరు పడేసి నోటికి హితవుగా వండిపెట్టే ఓపికలేని 'కుట్నబొంత' అయిపోందావిడ. ఆకార పుష్టి, నైవేద్య నష్టి. మంచానికి నిండుగా పడుకునో, కుర్చీకి నిండుగా కూర్చునో ఇంటికి లక్ష్మీకళ నాపాదించడం తప్ప మరి ఉపయోగంలేదు ఆవిడ వల్ల. నెమ్మదిగా వంటింటి బాధ్యతలన్నీ పార్వతి పరం అయ్యేయి.

ప్రొద్దుట మావయ్యకి బెడ్ కాఫీ అందించి, అత్త పూజకి ఏర్పాటుచేసి, టిఫిన్ తయారుచేసి, వంట వండి, అత్త చీరలు, మావయ్య బట్టలు పనిమనిషి చేత ఉతికించి తను స్వయంగా ఇస్త్రీచేసి ...

''హమ్మయ్య, నువ్వొచ్చేక నా ప్రాణం సుఖపడిందే పిల్లా... కుంచ మంత కూతురుంటే మంచం మీదే కూడు'' అంటారు. నా కన్నబిడ్డవు కాకపోయినా, నా అన్న పిల్లవు కాబట్టి ఈ రోగిష్టిదాన్నిలా ఆదుకుంటున్నావు. నాకీ రోగం వచ్చిన నాలుగేళ్ల నుంచీ ఎంతమంది వంట మనుషుల్ని పెట్టున్నామో ... నెల వందలు జీతాలిచ్చి, ముప్పొద్దులా కాఫీ టిఫిన్లతో సహా విడిది వియ్యపురాళ్లలాగా మెక్కబెట్టి ఏడాదికి మూడు కొత్త చీరలిచ్చినా ... ఒక్కతి కూడా నిలకడగా ఉండి చావలేదు. ఈ ఏడాది నించి నీ వల్ల మీ మామయ్యకి ఆదా అయిన డబ్బుతో రెండు కాసుల బంగారం కొనమ్మ, నీ మెడసలే బోసిగా ఉంది, మీ మామయ్య ముక్కు పిండి వసూలు చేసి...!' ఏదో అనబోయింది శకుంతలమ్మ.

''ఛ! నోర్మూయ్యి'' గర్జించాడు క్రిష్ణారావు. ''నా మేనకోడల్ని వంట మనిషితో పోల్చకు. దాని మెడ బోసిగా ఉంటే నేను దానికి గొలుసు కాకపోతే జిగినీ కొంటాను. అంతేకాని, ఇంటిపిల్లని పట్టుకుని వంటమనిషంటావేం'' కసురుకున్నాడు భార్యని.

వారం తిరగకుండానే పార్వతి మెడలో గొలుసు మెరిసింది.

ఏ రాయి అయితేనేం — పళ్లూడ గొట్టుకోడానికి ? వంట మనిషిగానో, ఇంటి మనిషిగానో తను చేస్తున్న చాకిరీకి కాష్ కాకపోతే కైండ్ ముడుతోంది. ఇంట్లో ఉన్న మిగతా పనివాళ్ళ

''గజల్'' సుఖం

ఎవ్వరి గజల్ సుధావాహిని
జాలువారే కంఠంలో కదులుతున్నదో ?
'ప్రపంచం మాయబొమ్మగా
దొరికితే మట్టి
దొరక్కపోతే పసిడి'గా మారి
సంగీత చక్రవర్తులకు మెరుగు పెడుతున్నదో ?
పరిసరాల పద ధ్వనులను మరచి
కేవలం పచ్చి సుఖమనే లాలసలో
అదమరిచే గజల్ పద ధ్వనులు,
ఆకలి — దారిద్ర్యం అతి పచ్చిగా దాడి చేస్తుంటే
సుఖమంతా మట్టిపాలైందని బొమ్మ బాదుకోడం
సంగీతాన్ని మెడలో పాముగా వేసుకోడం !
రాళ్లపై రోజూ ఆడే వేతివేళ్ళు
ఈ మట్టిలోని బంగారానికి తావినిచ్చే
ఆ కర్కశ కంఠాల గజల్ మాధుర్యానికి
ప్రపంచమే నిలిచి మురిసి ఆడే బొమ్మ !!

— నిఖిలేశ్వర్





తనని "చిన్న దొరసాని" గా గుర్తిస్తున్నారు ... చాలదూ!

రోజులు దొర్లుతున్నాయి ఈ లోపున మరో సంఘటన జరిగింది, పార్వతి మేనత్త లక్ష్మమ్మ బావగారి కొడుకు "పెళ్లికొడుకు" కావటానికి పాతికవేలు వరదక్షిణ కోరుతున్నాడట, పై సంబంధాల కయితే అంతకంటె రెట్టింపు ధర పలుకుతుందికాని ... అయినవాళ్ళు కాబట్టి, లక్ష్మమ్మగారి రికమెండేషన్ మేరకు ఆ మాత్రానికి ఒప్పుకున్నాట్ట. క్రిష్ణరావుగారు సోమతున్నవాడు కాబట్టి, ఈ సొమ్ము ఏమంత కష్టంకాదనీ, వెంటనేవచ్చి మాట్లాడి సంబంధం ఖరారు చేసుకోమనీ లక్ష్మమ్మ ఉత్తరం రాసింది.

ఉత్తరం చదివి క్రిష్ణరావు పెదవి విరిచేసేడు. "అయినవాళ్లతో సంబంధాలకి కూడా అంతంతేసి కట్నాలెక్కడపోస్తాం" అన్నాడు. "పాతికివేలిచ్చే టట్లయితే పాలిటెక్నిక్ స్టూడెంటేం ఖర్మ, కాలేజి లెక్చరర్నే తేవచ్చు" అభిప్రాయపడ్డాడు.

"ఎంధొమ్మిదేళ్లు నిండకుండానే దీని పెళ్లికి కంగారేముందిలెండి. బంగారు బొమ్మలాంటి పిల్ల. ఏ ఆఫీసరో చూసి ఎగరేసుకుపోతాడు. ఎవరి అదృష్టం ఎలా ఉంటుందో. వేదాంతం చెప్పిందాయన భార్య.

ఆఫీసరు మొగుడొస్తాడని ఆశలు కోర్కెలు అలవోకగా పెంచుకోకపోయినా, తన పెళ్లి తనంతట తను పూనుకుంటేనే కాని జరగదని గ్రహించింది పార్వతి. సమయం కోసం ఎదురు చూసింది. గాలం వేసింది.

"నీ కాళ్లమీద నువ్వు నిలబడగలిగేవంటే, మీ మేనత్త పట్టించుకోకపోయినా, మేనమామ ముందుకి రాకపోయినా, నీ పెళ్లిదానంతట అదే అయిపోతుంది. నా మాట విని అదిగో, ఆ ... డొమిష్టిక్కు కాలేజీయట. అదేదో అందులోచేరి ఏ కుట్టుమిషను డిప్లొమానో సంపాదించుకుంటే, మీ మామయ్య ఉద్యోగం చూసి పెడతారే పిల్లా ..." ఓ సలహా పారేసింది శకుంతలమ్మ. క్రిష్ణరావుకికూడా ఐడియా బాగానే నచ్చింది. పలుకుబడి ఉపయోగించి స్త్రీల

లవ్స్ లేబర్స్ లాస్ట్

వృత్తి విద్యా శిక్షణాలయంలో పార్వతికి సీటు సంపాదించేడు.

పార్వతి ఆర్టీసీ బస్‌పాస్ కొన్ననాటినుంచి కళ్లు పెద్దవి చేసుకుని లోకం చూడటం మొదలు పెట్టింది. డబ్బుకి, హోదాకి కాకుండా తన మంచి తనానికి, అందానికి ప్రాధాన్యం ఇచ్చే సామాన్యుడి కోసం అన్వేషణ ప్రారంభించింది. అట్టే కాలం గడవకుండానే శేఖర్‌తో పరిచయం అయింది.

వసంత రుతువు ప్రారంభం అయ్యింది. మోళ్లు మొగ్గలు తొడిగేయి, చిగురుటాకులు చిరు గాలికి వయ్యారంగా ఊగేయి. కోకిల "కో" అని పిలిచింది. పార్వతి పడుచు మనసు "కొహో" అని రెట్టించింది.

శేఖర్ పార్వతిని బస్టాప్‌లో కల్సుకుంటూనే

మెదడుకి పదును!

మనుషులలో జ్ఞాపకశక్తి పనిచేసే విధం విచిత్రంగా వుంటుంది. ఎవరైనా తనకు జ్ఞాపకశక్తి తక్కువని, తనకసలు ఏమీ జ్ఞాపకం వుండవని భావిస్తే, అతని జ్ఞాపక శక్తి నిజంగానే తగ్గిపోతుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోతుంటే విశ్వాసం కూడా తగ్గిపోతుంది. అంటే యిది ఒక రకమైన విషవలయం అని చెప్పవచ్చు. ఈ విషవలయాన్ని ఛేదించ టానికి మాక్స్‌ప్లాంక్ విశ్వవిద్యాలయంలోని మానసిక పరిశోధనల సంస్థవారు క్రొత్త ప్రయోగాలను చేపట్టారు. ఈ ప్రయోగాలలో చిన్నపిల్లలకు ఆసక్తికరమైన ఆటల గురించి వివరాలను, పెద్దలకు ఆసక్తికరమైన రాజకీయాల వివరాలను చెప్పి జ్ఞాపకం వుంచుకోమని కోరుతారు. అలాగే టెలిఫోను నెంబర్లు, చిన్న చిన్న పుస్తకాలు కంఠస్థం చెయ్యమని చెబుతారు. అభ్యాసం ద్వారా జ్ఞాపకశక్తిని పెంచటానికి వీరు కృషి చేస్తున్నారు.

ఉన్నాడు ఆమెని యథాశక్తి "ఖుశామద్" చేస్తూనే ఉన్నాడు.

"మీ పేరంటే నాకిష్టం. అందుకే మీరంటే కూడా నా కిష్టం. అల్ట్రా మోడర్ను పేర్లన్నా, మనుషులన్నా నాకు" చిరాకు, అన్నాడొక రోజున బస్సు కోసం ఎదురుచూస్తూ ఒంటరిగా నిలబడిన పార్వతిని పలకరిస్తూ!

పార్వతికెలాగో అయిపోయింది.

"నాక్కూడా మీ రంటె,ఇది" అనబోయింది. కాజీపేట బస్సొచ్చేసింది, శేఖర్ పరుగు పెట్టి బస్సందుకున్నాడు.

ఇంక మొదలయ్యింది పార్వతి గుండెలో తియ్యని కోత.

"అతనెవరో! ఏ కులమో! ఏం చేస్తున్నాడో! పెళ్లి కాలేదేమో! కాకుండా ఉంటే బాగుండును! ..."

"మీరు ఫామిలీతో ఉంటున్నారా ఆ యింట్లో!' బస్టాపుకి అల్లంత దూరాన కనిపించే పెంకుటింటి వేపు చూపిస్తూ అడిగింది ఆ మర్నాడతన్ని. పార్వతి అడగదల్చుకున్నదేమిటో వెల్లగోడ అంత తెల్లగా తెల్లమయింది శేఖర్‌కి. కొంటెగా నవ్వేడు. జాలిగా చూసేడు, సర్కాష్టిక్‌గా దగ్గాడు.

"ఫామిలీయా! ఇంకేమయినా నా ... నాకు పెళ్లే కాలేదండీ బాబూ! ... అయినా నా కెవరు పిల్లనిస్తారు! నాకే దారి లేక మా పెద్దమ్మ ఇంట్లో ఉంటున్నాను, ఇక పెళ్లాన్నేం పెట్టి పోషించను! అయామ్ ఏ బాచులర్ అండ్ బాచులర్ ఆఫ్ ఆర్ట్స్ ..."

ఈ సారి కాకతీయ యూనివర్సిటీ బస్సు; కాజీపేట బస్సు ఒకేసారి వచ్చేయి. ఇద్దరూ ఆదరా బాదరా పరుగులు పెట్టి బస్సులో దూరిపోయేరు.

"కట్నం పుచ్చుకోవడం నాకు నచ్చదండీ. కట్నం తీసుకుని పెళ్లి చేసుకుంటే ఆ డబ్బుతో ఆఫ్‌కోర్స్ ... ఉద్యోగం కొనుక్కోవచ్చనుకోండి! ఆ తర్వాత మనం డబుల్ సర్వెంటయిపోయే ప్రమాదం ఉంది. ఒకటి కట్నం ఇచ్చిన పెళ్లానికి, రెండు లంచంతో వచ్చిన ఉద్యోగానికీను ...

కాకపోతే ఉద్యోగం చేసే భార్య కావాలని మాత్రం కోరకుంటున్నాను. ఇద్దరి సంపాదనతోటే

కష్టం లేకుండా కాలం గడపగలం. అయిదేళ్ళగా ఉద్యోగం కోసం, ఉద్యోగం, మంచితనం, మోడెస్టీ ఉన్న మీలాంటి అమ్మాయి కోసం వెదుకుతున్నాను.''

పులకించిపోయింది పార్వతి. ఆ రోజంతా తెగ ఆలోచించింది. అతగాడు తనని ఘాటుగా ప్రేమిస్తున్నాడనుకుంది. అతని మాటలు పదేపదే తల్చుకుంది. అతనితో తన భవిష్య జీవితం తియ్యగా ఊహించుకుంది.

''మీలాంటి అమ్మాయి కోసం ... ''

తల్చుకు తల్చుకు రోమాంచిత అయ్యింది. ఆ రాత్రంతా నిద్రపోలేదు. ఏదో కమ్మని భావన.

శేఖర్, పార్వతి పేర్లు చక్కగా మాచ్ అయ్యేయి. ఇద్దరూ నిరాధార పక్షులే! అదంతకంటె బావుంది. ''దొందూ దొందూ కొందప్పే'' అన్నట్లుగా! ఇద్దరి మనసులు కలిసిపోయినట్లుగానే అన్పిస్తోంది.

ఆ భావన మరీ హాయిగా ఉంది.

మందమలయ మారుతం వంటికి తాకినట్లు, గులాబీలు గుబాళించినట్లు, జుంటితేనియ జాలినట్లు, అబ్బెబ్బె! అవన్నీ మన ఊహకి అతీతమయిన అనుభూతులు, మన అందుబాటులో ఉన్న ఆనందాలతోటే పోల్చుకుంటే సరి.

కమ్మని కంది పచ్చడి అన్నంలో గానుగ నూనె మిళాయించి వంకాయ పచ్చిపులుసు నంజుకుంటూ తిన్నట్లు, కొత్త ఆవకాయ వేడివేడి అన్నంలో కలిపి తింటూ మధ్య మధ్య బాగా ముగ్గిన పెద్దరసాల మామిడిపండు రసం పీల్చినట్లు, కాకపోతే అవ పెట్టిన పనసపొట్టు కూరతో కంచెడన్నం లాగించేసినట్లు...

పనసపొట్టు కూర తల్చుకోగానే అమ్మ గుర్తొచ్చింది పార్వతికి. ఇంకెక్కడి పనసపొట్టు కూర! అమ్మ చచ్చిపోగానే జిహ్వా చచ్చిపోయింది. జిహ్వా చావడం ఏమిటి !!! జీవితమే డొంకతిరుగుడు పట్టింది.

''అమ్మలేదు! నాన్నలేడు! ఏడుస్తే ప్రయోజనం లేదు. నేర్పుతో బ్రతుకు చక్కన చేసుకోవాలి!'' ఎత్తువేసి అట్నుంచి నరుక్కొచ్చింది.

శేఖర్ ఇట్నుంచి నరుక్కొస్తేడు. డబ్బుగల వ్యాపారస్థుడి మేనకోడలు. ఉప్పు బిగిస్తే పిట్ట, పిట్టతోపాటు మంచి ఉద్యోగం దక్కుతాయి. బెడిసి కొడితే అనుభవం చిక్కుతుంది! తనమాత్రం కమిట్ కాకుండా అమ్మాయిలో ఆశలు రేపడం మొదలుపెట్టేడు. పెద్దమ్మ దయాధర్మాలమీద ఆధారపడి ఉంటూ, ప్రతిరోజూ కాజీపేట రైల్వే ఆఫీసర్ల ఇళ్లంట వెళ్లి పిల్లలకి ట్యూషన్స్ చెపుతూ ఎంతకాలం! స్థిరమయిన ఉద్యోగం, నికడ ఉన్న ఆదాయం సంపాదించుకోవాలి!

''ఎస్. పార్వతి. అంటే మీ ఇంటి పేరు సునర్లా ... ''

''కాదు ... శ్రీపాద.''

''అరె! మీరూ మేమూ ఒకటే శాఖ! మా పెద్దక్కయ్యని శ్రీపాదవారికే ఇచ్చేం! మీ గోత్రంతో మా గోత్రం పెళ్లిళ్లకి చాలా అనువుగా కలుస్తుందట ... ''

ఆ రోజు పార్వతికి పట్టపగ్గాల్లేవు. అతను నిశ్చితంగా తనని ప్రేమిస్తున్నాడు. తను కావాలనుకుంటున్నాడు. తన పరిస్థితి అవగాహన చేసుకునేపాటి సంస్కారం ఉన్నట్లుగానే అనుపిస్తున్నాడు. అతనికి నికడయిన ఉద్యోగం దొరికితే, అదీ తన ద్వారా దొరికితే తనపని మరింత సుగమం అవుతుంది.

జాగ్రత్తగా ఆలోచించి ప్రణాళిక తయారు చేసింది.

''అత్తా! నువ్వేమీ అనుకోనంటే ఒక సంగతి చెప్పనా!'' ఒక ఆదివారం మధ్యాహ్నం భోజనాలయ్యేక క్రిష్ణారావు మేడమీద ఆఫీసులో ఏవో అర్జెంటు కాగితాలు చూసుకునేటప్పుడు మొదలుపెట్టింది పార్వతి ప్రణాళిక నిర్వహణ!

ఏమిటన్నట్లు చూసింది శకుంతలమ్మ, ఆ చూపులో భయం ఆందోళన కన్పించేయి. అవును మరి! అసలే బి. పి. పేషెంటు.

''మరేంలేదు డాలీ, ప్రవర్తన సరిగా లేదు!'' ముక్తసరిగా అని ఊరుకుంది. మిగతా కార్యక్రమం దానంతట అదే జరిగిపోతుందన్నట్లు.

''ఏంచేసిందే...''

''ఏంలేదు! మామయ్యతో కొంచెం అతి చనువుగా ఉంటేనూ! ... నా కళ్లతో చూసేను. నీతో చెప్తే బావుండదని ఊరుకున్నాను. కాని వ్యవహారం ముదురుతుంటే ఉండబట్టలేక ...''

—''ఛ ... డాలీ మా కళ్లముందు పిల్ల, నెలల గుడ్డుగా ఉన్నప్పటి నుంచి ఆ పిల్ల నెరుగుదురు మీ మామయ్య! స్నేహితుడి కూతురని తండ్రి లేని పిల్ల కదా అని ఆదుకుని ఉద్యోగం ఇచ్చేరు.

అంతపని చేస్తుందంటావా ... '' చివరి మాటలంటుంటే ఆవిడ కంఠం బాగా ఒణికింది, కళ్లనిండా కన్నీళ్లు నిండాయి. శకుంతలమ్మ బెదురు చూసి విజృంభించింది పార్వతి, అదే అదను అనుకుంటూ!

''అత్తా! డాలి సంగతి అలా వుంచు! వీదరి కంట్లో ఉంది. డబ్బు కోసం గడ్డి తింటుందను కుందాం! మామయ్య! ఇంతవయసొచ్చి...ఛ... '' మరి చెప్పడానికి తనకే అసహ్యంగా ఉందనట్లుగా ఆగిపోయింది. శకుంతలమ్మ కొంచెంసేపు మవునంగా ఉండిపోయింది. తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కనిపించింది. అప్రయత్నంగా కారుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ ...

''పిచ్చిదానా! మగాడికి వయసు ముదిరేకొద్దీ పోకిరీలక్షణాలు పెరుగుతాయి. నేను రోగిష్టి దాన్నయిపోబట్టి ఆయన అన్ని వేషాలు వేస్తున్నారు. నా ఖర్మ...'' బావురు మని ఏడ్చేసింది.

''బెంబేలుపడి ప్రయోజనం లేదు! ఉపాయం ఆలోచించాలి! మామయ్య మనవాడే కదా! ఆయన్నేమీ అనలేం! ఇక డాలీ! ఆమెని తిట్టనూ వద్దు. తుమ్మనూవద్దు...లాఘవంగా ఉద్యోగంలో నించి తప్పించేస్తే సరి!'' అత్తకి ధైర్యం చెప్పింది పార్వతి.

క్రిష్ణారావు ఉండే మేడమీదే అతని బిజినెస్సుకి సంబంధించిన ఆఫీసు ఉంది. డాలీ ఆంగ్లో ఇండియన్ గర్ల్. క్రిష్ణారావుకి పర్సనల్ సెక్రటరీ! ... అర్డర్లు బుక్ చెయ్యడం...ట్రంక్ కాల్స్ చూసుకోవడం... టైపింగ్ చూడటం ... విధి విరామం లేకుండా

కార్టూనిస్టులకు సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి.

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్లలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు.

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనా ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ ''ప్రత్యేక'' సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవద్దని మనవి.

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులతికించిన కవరు జతచేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥

డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

వి. ఆర్. పి. — విజయవాడ

నా వయస్సు 24 సంవత్సరములు. వారం రోజుల క్రితం నాకు పైల్సు వచ్చినట్లు తెలుసుకొన్నాను. అప్పటినుండి నాకు చాలా భయముగా వున్నది. వాటిని ఎలా నివారించాలో తెలియజేయండి?

★ నిపుణులైన శస్త్రవైద్యులచేత ముందుగా పరీక్షింపచేసుకొని వారి సలహా ప్రకారం ఆయింట్‌మెంట్లు వాడటమో, లేక శస్త్రచికిత్స చేయించుకోవటమో మాత్రమే నివారణా మార్గాలు.

జి. వి. ఆర్. — ఖమ్మం

నా వయస్సు 36 సంవత్సరములు, మాకు వివాహమై 16 సంవత్సరములయినది. వివాహమైన రెండు సంవత్సరములకు 3 నెలల గర్భం పోయినది. ఇంతవరకూ సంతానము లేదు. ఈమధ్య కాలమునుండి నేను, మావారు మందులు వాడుచున్నాము. మూడు నెలల నుండి బహిష్టు సమయములో ఒక్క రోజు మాత్రమే రక్తస్రావము అగుచున్నది. అది గూడా చాలా తక్కువ.

★ మీరు నిపుణులైన లేడీ డాక్టర్లవద్ద పరీక్షింపచేసుకోవటం అవసరం. నెత్తురులో హీమోగ్లోబిన్ పర్సంటేజ్ మొదలయిన పరీక్షలు చేయించటం కూడా అవసరమే! పరీక్షల ఫలితాలను బట్టి డాక్టర్లు వైద్యం చేస్తారు. రోగనిర్ధారణ కాకుండా సలహా చెప్పటం కష్టం.

ఆర్. ఎస్. ఎస్. ఎల్. - రాయగిరి

మా బాబు వయస్సు 5 నెలలు. మేము బాబుని నిలబెట్టినప్పుడల్లా రెండుకాళ్ళమీద సమముగా కాకుండా మడమలు ఎత్తి వ్రేళ్ళమీద నిలబడుచున్నాడు. ఇలా చూచి మేమంతా చాలా ఆందోళన పడుచున్నాము?

★ ఆర్థోపీడిక్ సర్జన్లకి మీ బాబుని వెంటనే చూపించండి. పుట్టినప్పుడే రాగల టాలిపెస్ ఈక్వైనో వారస్ అనే దానివల్ల ఇలా అయ్యే అవకాశం ఉంటుంది. కొంచెం వయస్సు వచ్చిన తర్వాత చిన్న శస్త్రచికిత్స చేయటమో, ప్రత్యేకమైన బూట్లను వాడటమో చేయటం వల్ల ఈ లక్షణాన్ని సరిచేయవచ్చును.

ఇ. ఎస్. కె. - వగరి

పిల్లలు పుట్టిన వారానికే 'ఫిట్స్' ఎందువలన వస్తాయి? 15వ రోజువరకు బొడ్డు వూడనందుకు కారణమేమిటి? 'మాడు' గట్టిగా వుండి వాచినందుకు కారణమేమిటి?

★ పుట్టిన వారం లోపల ఫిట్స్ రావటానికి మెదడు పరిపక్వం చెందకపోవటం దగ్గరనుంచి పుట్టినప్పుడు తగిలే దెబ్బలదాకా చాలా కారణాలున్నాయి.

కొందరికి (శిశువులకి) అంబెలికల్ కార్డ్ ఎక్కువ ఫైబ్రస్‌గా ఉండటంవల్ల, గట్టితనం వల్ల బొడ్డు ఊడటం ఆలశ్యం అయ్యే అవకాశం ఉన్నది.

ఇకపోతే మీ మూడవ ప్రశ్న: మాడు గట్టిగా ఉండి, వాచినట్లు ఉంటే అది మెదడు పై పొరలు వాయటాన్నిగానీ, ఆ పొరలలో ఉండే ద్రవపీడనం (సెరిబ్రోస్పైనల్ ఫ్లూయిడ్ ప్రెషర్) అధికమవటాన్నిగానీ సూచిస్తుంది.

ఎ. ఎస్. — ఆముదాలవలస

మావారు వారం రోజుల క్రితం కాళ్ళు పీకుతున్నాయి, కళ్ళు తిరుగుతున్నాయి, తల చాలా బరువుగా వుండి విపరీతమైన తలనొప్పి వస్తోంది అన్నారు. ఏ విచారమైన వార్తగాని విన్న వెంటనే చాలా నీరసము వచ్చి కాళ్ళల్లో సత్తువలేనట్లు అలా కూర్చుండిపోతారు. డాక్టరుకి చూపిస్తే బి. పి. ప్రారంభంలో వున్నది. మందులు, ఇంజక్షనులు వాడితే అదేమీ చేయదు అని అన్నారు.

★ డాక్టరు చెప్పినట్లే ఇంజక్షన్లు, టానిక్, మాత్రలు వాడండి. పై లక్షణాలు ఉన్నవారు ఎక్కువగా బి. కాంప్లెక్స్ మాత్రల రూపంలోగాని, ఇంజక్షన్ రూపంలోగాని వాడవలసి ఉంటుంది. నరాల బలహీనతవల్ల పై లక్షణాలు ఏర్పడతాయి గనుక, ఈ లక్షణాలు తగ్గనప్పుడు న్యూరోఫిజీషియన్ల సలహా పొందవలసి ఉంటుంది. ●

ఆఫీసులో అడుగు పెట్టిన దగ్గర్నుంచి సాయంత్రం డ్యూటీ దిగిపోయేదాకా పనిచేస్తుంది.

క్రిష్ణారావుకి డాలీమీద పుత్రికా వాత్సల్యం. ఆ అమ్మాయి పొందికతనం అంటే ఇష్టం. సిన్సియారిటీమీద గౌరవం, బీదరికంపట్ల జాలి! స్నేహితుడి కూతురు కాబట్టి, దూరంగా ఎక్కడో బెంగుళూరులో కాన్వెంటు చదువు చదువుతున్న అదే వయసు తన బిడ్డని శైలజని ... డాలీలో చూసుకుంటుంటాడు, ఆప్యాయత చూపిస్తాడు. చనువు తీసుకుంటాడు.

"డాలీ పోర్‌మీలిటెల్ కాఫీ డియర్" డాలీ ఫ్లాస్కులో కాఫీ కప్పులో పోసి క్రిష్ణారావుకి అందిస్తుంది.

"లైటప్ మై సిగరెట్ డార్లింగ్"

డాలీ సిగార్ లైటర్ వెలిగించి క్రిష్ణారావు పెదాల మధ్య ఉన్న సిగరెట్ ముట్టిస్తుంది.

ఆ చేష్టలేవీ ఇదివరకు ఎబ్బెట్టుగా అన్పించలేదు శకుంతలమ్మకి. పార్వతి రాజేసిన నిప్పు నెరుసు రగిలి రగిలి భగ్గున మండి శకుంతలమ్మని హైరాణ పెట్టి క్రిష్ణారావు ప్రాణం మీదికి తెచ్చింది.

లవ్స్ లేబర్స్ లాస్ట్

గత్యంతరంలేక మూడు నెలల జీతం ఎదురిచ్చి బాధపడుతూనే డాలీని ఉద్యోగంలోనించి తీసేశాడు క్రిష్ణారావు. ఫలితంగా ఆఫీసులో ఆయనకి శ్రమ ఎక్కువయింది. ఇంట్లో చిరాకులు పెరిగిపోయేయి. "అనవసరంగా అయన్ని అనుకున్నామేమో! ఇప్పుడు పాపం పనంతా ఆయనమీద పడింది. ఎలా సిరపించి పోతున్నారో"...శకుంతలమ్మ పశ్చాత్తాపం కూడా పార్వతి సొమ్ముచేసుకుంది.

"డాలీ సంగతి నీతో చెప్పి మామయ్య శ్రమను అధికం చేసేను. ఆయనకి ఇంకో సెక్రటరీని చూసే బాధ్యత నేను తీసుకుంటాన్లే ... ఈసారి లేడీ సెక్రటరీ వద్దు. నాకు తెల్సిన ఓ అబ్బాయి ఉన్నాడు."

శేఖర్ గుణగణాలు వర్ణించింది. అతను తనకెలా పరిచయం అయిందీ వివరించింది. 'అత్యవసరంగా అతనికి జాబ్ కావాలిట పాపం! సాటి కుఱ్ఱాడు. స్ఫురద్రూపి, మంచి డిగ్రీలున్నవాడు, మంచివాడు."

శేఖర్ ఉద్యోగంలో చేరేడు. పనివాడితనంతో క్రిష్ణారావుని వశం చేసుకున్నాడు. మాట ఒద్దికతో శకుంతలమ్మ మనసు చూరగొన్నాడు. అందం, ఆకర్షణ, చలాకీతనం పణంపెట్టి, వేసవి సెలవుల కంటూ బెంగుళూరు నుంచి వరంగల్లు వచ్చిన శైలజ మనసు దోచేసుకున్నాడు.

రిజల్టు ... బిజినెస్‌లో పావలా వాటా కట్నం ఇస్తూ పిల్లనివ్వడానికి క్రిష్ణారావు దంపతులు నిర్ణయం తీసేసుకున్నారు.

పాపం ... పార్వతి! తను ప్రపోజ్ చెయ్యడమే తరువాయిగా తనని పెళ్ళి చేసుకుని వెంటనే వేరే కాపురం పెట్టేస్తాడని శేఖర్‌మీద ఆశలు పెంచుకున్న పార్వతికి మాత్రం ...

"లవ్స్ లేబర్స్ లాస్ట్"

తొలికోడి కూసేదాకా గతం నెమరుకి తెచ్చుకుని గుండె చిక్కబట్టుకుని, మొండి ధైర్యం తెచ్చుకుని...

పోనీలే.

"ఆల్ ఈజ్ నాట్ లాస్ట్"

"మరో ప్రయత్నం చేద్దాం."

అనుకుంటూ లేచి మామూలు పనులకి ఉపక్రమించింది పార్వతి. ●